## క్లుప్తంగా

### శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలను తీసుకెళ్తున్న అర్చకులు

**కొమ్మాది:** రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలను తీసుకుని వచ్చారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనం కలిపించారు.

### అనారోగ్యంతో ఉన్న బాలికకు ఆర్థిక సాయం



బాలికకు నగదు సాయం చేస్తున్న నాయకులు

**మధురవాడ:** జీవీఎంసీ 5వ వార్డు ముత్యాలమ్మ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న తొమ్మిదేళ్ల మాధురికి కాలనీ వాసులు అండగా నిలిచారు. శనివారం కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు చేతుల మీదుగా రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ బాలిక కడుపులో బల్ల పెరుగుతోందని వైద్యులు నిర్ధారించారు. ఈమె తల్లి సంరక్షణలో ఉంది. ఆర్థికంగా వెనుకబడిన ఈమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఈ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్.బాబ్జి, కాలనీవాసులు పాల్గొన్నారు.

### సిగ్నల్ లైట్లు ప్రారంభం



లైట్లను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఏడీసీపీ శ్రావణ్ కుమార్

**కొమ్మాది:** జీవీఎంసీ 8వ వార్డులోని బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రధాన కూడలి వద్ద సిగ్నల్ లైట్లను శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఏడీసీపీ శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కుమారస్వామి, ద్వారకా ట్రాఫిక్ సీఐ కేఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 'మార్చి నాటికి కైలాసగిరి పార్కు సుందరీకరణ'

**ఆరిలోవ:** పర్యాటక ప్రాంతం కైలాసగిరి పార్కును మార్చి నాటికి సుందరంగా తయారు చేస్తామని వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్‌రాజు తెలిపారు. 'అధ్వానంగా కైలాసగిరి పరిసరాలు'అనే శీర్షికతో ఈ నెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో జరగనున్న జీ.20 సదస్సుకు పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని ఓ ప్రకటనలో తెలిపారు. కొండపై రాతి శిల్పాల పార్కులో నడకదారులు బాగు చేయడం, పచ్చదనం కోసం మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శంఖు చక్ర నామాలు నుంచి తెలుగు మ్యూజియం వరకు సర్వీస్ రోడ్డులో డెక్ పనులు, నడక మార్గం పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా రోడ్డు తవ్విన వైపు సందర్శకులు ఎవ్వరూ వెళ్లకుండా స్టాపర్లు అడ్డం పెట్టామన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి స్టాపర్లు తొలగిస్తామన్నారు. ఈ పనులు రూ.29 లక్షలతో జరుగుతున్నట్టు తెలిపారు.



# వైఎస్సార్‌సీపీతో ప్రతి కుటుంబానికీ మేలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**భీమునిపట్నం:** మన రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలిలోని మూడవ వార్డు పరిధిలో మత్స్యకారులుండే బోయి వీధి ప్రాంతంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వందలాది హామీలతో కూడిన మేనిఫెస్టోతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. కానీ సీఎం జగన్ తాను పాదయాత్ర చేసిన సమయంలో ప్రజల కష్టాలను చూసి, వారికేం కావాలో ఆలోచించి మేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. ఆయన్ని నమ్మి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు, అధికారంలోకి వచ్చిన ఆరంభం నుంచే మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని సంక్షేమ పథకాలతోపాటు, మేనిఫెస్టోలో లేని సంక్షేమాన్ని కూడా అమలు చేశారని కొనియాడారు. ఈ విధంగా చెప్పిన వాటిని, చెప్పని వాటిని కూడా అమలు చేసిన ఘనత దేశంలో జగన్ మాత్రమే సాధించారని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పినవన్నీ అమలు కావడం వల్లే, తనతోపాటు అన్ని ప్రాంతాల ఎమ్మెల్యేలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎంతో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి, స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలంతా ప్రభుత్వ పాలనపై చాలా సంతృప్తిగా ఉన్నారని, మళ్లీ సీఎంగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి పక్షాలు దీన్ని చూసి తట్టుకోలేకే.. వారేం చేస్తారో చెప్పుకోకుండా.. కేవలం సీఎం జగన్‌పైన ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. విపక్షాల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని రాబోయే ఎన్నికల్లో వారిని చిత్తుగా ఓడించి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే ఎన్నుకోవడం ఖాయమన్నారు. ఈ ప్రాంతంలో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్సీ రాముతో పాటు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి కొండబాబు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 3వ వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, నాయకులు కదిరి ఎల్లాజీ, మైలిపల్లి లక్ష్మణరావు, గుండాసి మధునాయుడు, వాసుపల్లి ఎల్లాజీరావు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, భాగం స్వాతి సుధాకర్, కోండ్రు రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేసే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ



ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్టౌలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

**ఆనందపురం:** ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గంభీరం పంచాయితీలో పేదలకు 830 ఉచిత గ్యాస్ కనెక్షన్లు, స్టౌలు, సిలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలో టీడీపీ గెలిచినా ఈ మూడేళ్లలో పంచాయతీ అభివృద్ధికి రూ.5.75 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.12కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. అర్హతే ప్రామాణికంగా జగనన్న కాలనీల్లో 256 గృహాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. కొన్ని పంచాయితీల్లో కోర్టు కేసుల కారణంగా ఇళ్ల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ఎన్నికలు ఏవైనా మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లవరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఉపాధ్యక్షుడు పాండ్రంగి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, ఉప్పాడ రామిరెడ్డి, డోల దేవుడు, బొట్ట రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు, బీఆర్బీ నాయుడు, రౌతు వెంకటరావు, ఉప్పాడ అప్పారావు, బోయి వెంకటరమణ, ప్రసాదరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దృష్టికి యాతవాని చెరువు ట్యాంపరింగ్

- స్థానిక రైతులు, నాయకుల తీర్మానం



యాతవాని చెరువు వద్ద సమావేశమైన రైతులు, నాయకులు

**పద్మనాభం :** మండలంలోని రేవిడి యాతవాని చెరువు గర్భం ట్యాంపరింగ్ చేసి జిరాయతీగా మార్చారని వచ్చిన ఆరోపణలపై ఆయకట్టు రైతులు సమావేశమై, విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. యాతవాని చెరువు వద్ద రైతులు, స్థానిక నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. సర్వే నెంబర్ 73/2లో 7.76 ఎకరాల విస్తీర్ణంలో యాతవాని చెరువు ఉంది. ఈ చెరువు కింద సుమారు 30 ఎకరాలు సాగవుతోంది. చెరువుకు నీటి పారుదల శాఖ నిధులు వెచ్చించి మధుంలు, రక్షణ గోడలు నిర్మించారు. ఉపాధి హామీ పథకంలో పూడిక తొలగించారు. 7.04 ఎకరాలను రెవెన్యూ అధికారులు 1బీలో నమోదు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో రైతులు చెరువు గర్భాన్ని పరిరక్షించుకునేందుకు సమావేశమయ్యారు. చెరువు గర్భాన్ని 1బీలో నమోదు చేయడంపై జిల్లా కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు. చెరువు గర్భం జోలికి వస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని రైతులు తెలిపారు. కార్యక్రమంలో రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కోన రమణ, మరగడ అప్పారావు, రేవిడి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆవాల గంగరాజు, టీడీపీ నాయకుడు పాండ్రంగి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

# డ్రైనేజీని ముంచెత్తిన పాలిథిన్ వ్యర్థాలు



తగరపువలస-భీమిలి రోడ్డులో జీరుపేట వద్ద డ్రైనేజీని ముంచెత్తిన పాలిథిన్ వ్యర్థాలు

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు జీరుపేట వద్ద ప్రధాన డ్రైనేజీ పాలిథిన్ వ్యర్థాలతో నిండిపోయింది. ఒకవైపు జీవీఎంసీలో ప్లాస్టిక్‌ను నిషేధించినా, తగరపువలస-భీమిలి రోడ్డు పక్కన మాత్రం కుప్పలు తెప్పలుగా డ్రైనేజీలలో ప్లాస్టిక్ దర్శనమిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. జీరుపేట గ్రామంలోకి వెళ్లే మదుంల కింద డ్రైనేజీలో పూడిక పెరిగిపోవడంతో మురుగునీరు నిలిచిపోయింది. జీరుపేట-చిల్లపేట గ్రామాల మధ్య డ్రైనేజీలలో పూడికతో పాటు, పాలిథిన్ వ్యర్థాలను తొలగించాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్‌లో పైపులైన్ల మరమ్మతు కారణంగా ఈ నెల 28, 29 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలిలో 450 కేఎల్, 800 కేఎల్ రిజర్వాయర్లను పంపింగ్ చేసే జీఆర్పీ పైపులైన్‌కు పలు చోట్ల మరమ్మతులు చేస్తున్నందున శని, ఆదివారాల్లో భీమునిపట్నం పరిసర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ రెండు రోజులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని.. అంతరాయానికి సహకరించాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం ఫిట్టర్ డి. హరిని 63003 89896, ట్యాంకర్ ఇన్‌చార్జి త్రినాథ్‌ను 98660 46100 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

**తగరపువలస:** జీవీఎంసీ ఒకటోవార్డు వెలంపేటకు చెందిన వానపల్లి సతీష్(39) చికిత్స పొందుతూ గురువారం రాత్రి సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మృతి చెందాడు. భీమిలి ఏఎస్ఐ రామం తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సివిల్ సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. 2019లో పనిమానేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. తరచూ చనిపోతానంటూ ఇంట్లోవారిని బెదిరిస్తుండేవాడు. ఈ నెల 21న తాను చనిపోతున్నట్టు కుటుంబ సభ్యులకు వాట్సాప్‌లో మెసేజ్ పంపించి మద్యంలో పురుగుల మందు కలిపి సేవించాడు. ఇంతలో వారు ఇంటి మేడపైకి వెళ్లి చూడగా నోట్లో నుంచి నురగలు కక్కుతూ పడి ఉన్నాడు. వెంటనే చికిత్స కోసం సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు. ఇతని మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని కేవలం మద్యం మత్తులో పురుగుల మందు సేవించి ప్రాణాలపైకి తెచ్చుకున్నట్టు మృతుని సోదరుడు వానపల్లి నరేంద్ర భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# జయహో జనగణమన



జనగణమన గీతాలాపనలో సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు

**తగరపువలస:** విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా భారత రాజ్యాంగ సభ ఆమోదించి 73 వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఒకటోవార్డు రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాలలో సస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జనగణమన గీతాన్ని ఆలపించారు. సస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, సరిహద్దులు, ఆచార వ్యవహారాలు అద్దం పట్టేలా రవీంద్రనాథ్ జనగణమన రచించారని కొనియాడారు. దీనిని ప్రతి భారతీయుడు ఆలపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్ కేర్ యు సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సర్వేయర్లకు సత్కారం



సర్వేయర్లను సత్కరించిన దృశ్యం

**ఎంవీపీ కాలనీ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో భాగంగా జిల్లాలోని 11 గ్రామాల్లో భూసర్వే విజయవంతంగా పూర్తయింది. దీంతో ఆయా గ్రామాల్లో సర్వేను వేగవంతంగా పూర్తి చేసిన సర్వేయర్లను ఏపీ సర్వేయర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ ఇసుకతోట దరి ఓ సమావేశ మందిరంలో ఏపీఎస్ఈఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపన కనకబాబు అధ్యక్షత ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్వేయర్లు ప్రసాదరావు(కమనం గ్రామం), దేవి (ఎన్‌జీఆర్ పురం గ్రామం), పద్మావతి (చిన్నాపురం గ్రామం), లావణ్య (బుడ్డివలస గ్రామం), లలిత, చిరంజీవి, సంతోష్ (తిమ్మాపురం గ్రామం), అప్పలరెడ్డి(ఆర్.వై.అగ్రహారం), వినోద్(నిడిగట్టు), లక్ష్మణ్ (రాజయ్యపేట)లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఈటీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మాతా ప్రసాద్, భీమిలి మండల సర్వేయర్ రమేష్, భీమిలి తాలూకా అధ్యక్షుడు మణిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎండాడ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

**కొమ్మాది:** జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో కాకినాడలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

# భిన్నత్వంలో ఏకత్వం

- ఘనంగా తాజుద్దీన్‌బాబా జయంతి



బాబా దర్బార్ వద్ద భక్తుల సందడి



ఆశ్రమంలో నమాజ్ చేస్తున్న భక్తులు

**తగరపువలస:** దాకమర్రి ఆశ్రమంలో తాజుద్దీన్‌బాబా 162వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు ఊరేగింపుగా చందనం, శాలువాలు తీసుకువచ్చి బాబా దర్బారుపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆశ్రమంలో భిన్నత్వంలో ఏకత్వం కనిపించింది. బాణసంచా, కోలాటం, నేలవేషాలు, సాముగరిడీలు, తీన్‌మార్, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య బాబా చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వినోదం కోసం ఖవ్వాలీ ఏర్పాటు చేశారు. నమాజ్ వేళ ముస్లింలకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆశ్రమం నుంచి రాజాపులోవ-రాయ్‌పూర్ జాతీయ రహదారి వరకు ఏర్పాటు చేసిన పరసలో భక్తులు వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆశ్రమంలో తాజుద్దీన్ దర్బారును దర్శించుకుని.. తర్వాత ఆశ్రమ ప్రతినిధి రెడ్డిబాబా ఆశీస్సులు తీసుకున్నారు. దునిలో అగరబత్తీలు వెలిగించి బాబా దర్బారు, చిత్రపటాల వద్ద గులాబీలు, అత్తరులు ఉంచారు. ఆశ్రమం ఆవరణలో వేలాది మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగింపుగా తాజుద్దీన్‌బాబా ఫొటో



ఆశ్రమం బయట ఏర్పాటు చేసిన పరస

## ముగిసిన వసంత పంచమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

**కొమ్మాది:** సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పూజల్లో రాధాకృష్ణులను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం




మాట్లాడుతున్న ఆచార్య రాజేంద్ర కర్మార్కర్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, ఆనంద్ మార్గ్ ప్రచారక సంఘం సంయుక్తంగా రెండు రోజుల యోగా, ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అతిథులు ప్రభాత్ రంజన్ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కర్మార్కర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసికంగా ధృడంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం ఉపకరిస్తాయన్నారు. రినైసెన్స్ యూనివర్సల్(ఆర్‌యూ) కార్యదర్శి ఆచార్య వితమోహనానంద విద్యార్థులకు యోగా ప్రాధాన్యత, నిత్య జీవనంలో ఉపయోగాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్‌యూ ప్రతినిధి నారాయణ పాండా, ఏయూ ఎన్ఎస్ఎస్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రామచంద్రరావు, స్టీల్‌ప్లాంట్ ఏజీఎం ఎ.వి.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య



అడవివరం హైస్కూల్‌లో ప్రధాని ప్రసంగం వీక్షిస్తున్న విద్యార్థులు, హెచ్ఎం పైడిరాజు

**విశాఖ విద్య:** ప్రధాని మోదీ 'పరీక్ష పే చర్చ' పేరిట శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వీక్షించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను వినియోగించి.. ప్రధాని మోదీ ప్రసంగం వీక్షించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఒత్తిడి లేని రీతిలో చదువులు సాగాలనే ప్రధాని ప్రసంగం దిక్సూచి కానుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు భాగస్వాములయ్యారనే వివరాలను విద్యాశాఖాధికారులు సేకరించారు. విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచారు. పరీక్షల సమయంలో ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

# విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**తగరపువలస :** జీవీఎంసీ భీమిలి జోన్ సంతోపేట అంబేడ్కర్ హైస్కూల్లో గత విద్యాసంవత్సరంలో గణితం, సోషల్ స్టడీస్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంఈవో కేఏ బాలామణి చేతుల మీదుగా శుక్రవారం రూ.500 వంతున అందించారు. ఈ మొత్తాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.చిన్నంనాయుడు, పి.సత్యలక్ష్మి అందించగా వీటిని విద్యార్థులు బి.వరుణ్‌సందేశ్, డి.రాజ్‌సాత్విక్, ఎస్.సుస్మిత, ఎస్.శరణ్య, ఎ.లహరిలకు అందించారు. అలాగే పాఠశాల ఉద్యోగి కె.బలరామకృష్ణ తన మామయ్య బొత్స వరాహరావు జ్ఞాపకార్థం గతేడాది టెన్త్‌లో 555 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఏ కార్పొరేట్ కళాశాలలో అయినా రెండేళ్లు ఉచితంగా చదివిస్తానని వాగ్దానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, హెచ్ఎం వై.జగన్నాథస్వామి, మాజీ కౌన్సిలర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# మేకలకు పీపీఆర్ టీకాలు



టీకాలు వేస్తున్న మహేష్ కుమార్

**పద్మనాభం :** జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పద్మనాభంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 126 మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. పద్మనాభం పశువైద్యాధికారి కె.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మేకలకు టీకాల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

# అక్షయపాత్రతో ఐవోసీ ఒప్పందం

**ఆనందపురం:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్)లో భాగంగా 7 పాఠశాలల్లో 1,717 మంది విద్యార్థులకు భోజనం అందించేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్‌తో శుక్రవారం ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ రామ్మోహన్ తెలిపారు. తాజాగా తమ సంస్థ పారాదీప్ నుంచి హైదరాబాద్ వరకు గ్యాస్ పైప్ లైన్ వేయనున్నట్టు తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## సమాచారమ్

**మధురవాడ :** జీవీఎంసీ మధురవాడ జోన్-2లో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోనల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల్లో పలువురు అధికారులు, ముఖ్య ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో పలువురు బాధ్యతలు చేపట్టారు. ప్రధాన విభాగాల్లో కొత్తగా చేరిన వారి వివరాలు.

| అధికారి పేరు | హోదా | ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 1. కె.కనకమహాలక్ష్మి | జోనల్ కమిషనర్ | 98483 66878 |
| 2. సీహెచ్ రఘునాథరావు | టౌన్‌ప్లానింగ్ ఏసీపీ | 78930 07336 |
| 3. హేమంత్ | బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ | 99123 49480 |
| 4. వెంకటరావు | ఇంజినీరింగ్ వర్క్స్ ఏఈ | 77299 95944 |
| 5. ముగడ రాజు | ఆర్ఐ, రెవెన్యూ విభాగం | 98664 44408 |